క్లుప్తంగా

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ



ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన గౌరీశంకర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండల విద్యాశాఖాధికారి–1గా డి.గౌరీశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం అమలాపురం మండలం నల్లవంతెన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న గౌరిశంకర్ ముమ్మిడివరం ఎంఈఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనను మండల ఎంఈఓ–2 ఆర్ ఉదయ భాస్కర్, మండల వనరుల కేంద్రం సిబ్బంది, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: వాకర్స్ వ్యవస్థాపకుడు సుంకర అళ్వార్ దాస్ 22వ వర్ధంతి సందర్భంగా స్థానిక బంగారు, వెండి వర్తకుల సంఘం భవనంలో పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి మనిషి ఆరోగ్యం కోసం రోజులో ఎంతో కొంత సమయం నడవాలన్న పిలుపుతో వాకర్స్ క్లబ్‌లకు శ్రీకారం చుట్టిన అళ్వార్ దాస్ చిరస్మరణీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ ఏరియా ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, డాక్టర్ బి.రాఘవేంద్రరావు, డాక్టర్ సీహెచ్.విష్ణుమూర్తి, వాకర్స్ క్లబ్ కార్యదర్శి బూరగాయల శివ రామకృష్ణ, కోశాధికారి పడాల నాయుడు పాల్గొన్నారు.

జార్జీపేటలో అన్న సమారాధన



అన్న సమారాధన నిర్వహిస్తున్న నిర్వాహకులు

తాళ్లరేవు: జార్జీపేట గ్రామంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో సోమవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. స్థానిక మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జార్జీపేట, నీలపల్లి, పోలేకుర్రు తదితర పంచాయతీలతో పాటు యానాం ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. 76 ఏళ్లుగా జార్జీపేటలో మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు సహకరిస్తున్న వారందరికీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సినీ నటుడు కృష్ణంరాజుకు నివాళి

అమలాపురం టౌన్: సినీ నటుడు, నిర్మాత, కేంద్ర మాజీ మంత్రి దివంగత ఉప్పలపాటి కృష్ణంరాజు 86వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం నిర్వహించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కర్రి రామస్వామి, మాజీ కౌన్సిలర్ తిక్కిరెడ్డి నేతాజీ, టీఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు, పాలమూరి ధర్మపాల్, కుంచే వెంకన్నబాబు తదితరులు ప్రసంగించారు. కృష్ణంరాజు నటనా కౌశల్యాన్ని, కేంద్ర మంత్రిగా అందించిన సేవలను కొనియాడారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

యానాం: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక నెహ్రూ యువకేంద్రం, ప్రభుత్వ ఐటీఐ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వాహన చోదకులుకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ నెల 17 నుంచి 23 వరకు యానాం పరిసర ప్రాంతాల్లో వలంటీర్లు, యువకుల ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. చిన్నా సెంటర్, పాతబస్టాండ్, న్యూ బస్టాండ్, ఎస్‌బీఐ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులతో కలిసి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై నూకరాజు, జిల్లా యువజన అధికారి గోపి తదితరులు పాల్గొన్నారు.

కలుపు మొక్కలతో జర జాగ్రత్త!

- పిస్టియా, సాల్వినియాతో వరికి పెనుముప్పు
- ముంపు ప్రాంతాల్లో శరవేగంగా విస్తరిస్తున్న వైనం
- పైరు ఎదుగుదలకు అవరోధం
- జాగ్రత్తలు తీసుకోకుంటే అపార నష్టం



రెల్లుగడ్డ వరి చేలలో పిస్టియా, సాల్వినియా కలుపు



ఎంట్రుకోనలో మడిలో పేరుకుపోయిన సాల్వినియా కలుపును గట్టుపైకి చేర్చుతున్న రైతులు

అల్లవరం: ముంపు ప్రభావిత ప్రాంతాల్లో వరి సాగు పెను సవాలుగా మారింది. ఓ పక్క ముంపు తీరక నానా అవస్థలు పడుతున్న రైతులకు దాళ్వా పంటకు కలుపు పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. దాళ్వా పంటను వదులుకోలేక కొండంత ఆశతో సాగు చేస్తున్న రైతాంగానికి వేళ్లూరుతున్న కలుపు మొక్కలు పిస్టియా, సాల్వినియాతో గడ్డు పరిస్థితి ఎదురవుతోంది. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో చాలా వేగంగా ఈ కలుపు మొక్కలు వరిచేలను ఆక్రమిస్తున్నాయి.

ప్రవాహం లేని నీటిలో జలచర జాతికి చెందిన ఈ కలుపు మొక్కలు చాలా వేగంగా పెరుగుతాయి. ఒక మొక్క ఉంటే చాలు.. కొన్ని రోజుల వ్యవధిలో వేళ్లూరుతూ లక్షల్లో కలుపు మొక్కలు పుట్టుకొస్తాయి. పిస్టియా, సాల్వినియా కలుపు మొక్కలు ఉన్న వరిచేలల్లో వరినాట్లు వేయడానికి తీవ్ర ప్రతిబంధకంగా మారింది. ఈ కలుపు మొక్కలను తొలగించకుండా నిర్లక్ష్యంగా వరినాట్లు వేస్తే భారీ మూల్యం చెల్లించు కోవాల్సిందే. పిస్టియా, సాల్వినియా మొక్కలు నాట్ల మధ్య ఖాళీలో పెరిగిపోయి ఎరువులు, క్రిమి సంహారకాలు మొక్కకు లభించకుండా అడ్డుకుంటాయి. దీంతో సమయానుకూలంగా పైరుకి ఎరువులు అందక ఎదుగుదల లోపించి తీవ్ర నష్టానికి దారి తీస్తుంది.

అల్లవరం మండలంలో ముంపు ప్రభావిత గ్రామాలైన రెల్లుగడ్డ, అల్లవరం, ఎంట్రుకోన, తూర్పులంక, తుమ్మలపల్లి, మొగళ్లమూరు, దేవగుప్తం, గోడి, డి.రావులపాలెం గ్రామాలు, ఉప్పలగుప్తం మండలంలో ముంపు ప్రభావిత గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పిస్టియా, సాల్వినియా కలుపు మొక్కలు వరి పంటకు తీవ్ర నష్టాన్ని కలగజేస్తున్నాయి. కలుపు మందు పిచికారీ చేసి వాటిని తొలగించడం పెద్ద సవాలుగా మారింది. అధిక శ్రమతో పాటు అధిక వ్యయం వెచ్చించాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిస్టియా, సాల్వినియా కలుపు మొక్కల నివారణకు చర్యలు తీసుకోకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. వరిసాగుకు తీవ్ర ప్రతిబంధకంగా మారుతున్న ఈ ప్రమాదకర మొక్కలను ఆదిలోనే తొలగిస్తే అన్నదాతలు పంట నష్టం నుంచి బయట పడవచ్చు.

నిర్లక్ష్యం వద్దు



వరిమడుల్లో పిస్టియా, సాల్వినియా కలుపు మొక్కలను గుర్తిస్తే మడిలోని నీటిని బయటకు మళ్లించడం ద్వారా కలుపు మొక్కల తీవ్రత తగ్గుతుంది. ఆ తర్వాత వరిమడిని బాగా ఆరబెట్టి ఆపై పారాక్వాట్ కలుపు మందు ఎకరాకు 1 లీటరు, 2–4డీ సోడియం సాల్ట్ ఎకరాకు 400 గ్రాముల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. వరినాట్లు వేసిన తర్వాత అయితే కేవలం 2–4డీ సోడియం సాల్ట్‌ను మాత్రమే పిచికారీ చేయాలి. పిస్టియా, సాల్వినియా కలుపు మొక్కలు చచ్చిపోయి ఎండిపోయిన తర్వాత మడిని శుభ్రం చేసి ఆపై దమ్ము చేసి వరినాట్లు వేయాలి. రైతులు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా వరిలో దిగుబడి తగ్గే ప్రమాదం పొంచి ఉంది.

– ఎస్‌వీవీ సత్యనారాయణ, వ్యవసాయధికారి, అల్లవరం

దందాలు, రౌడీయిజం చేస్తే ఊరుకోం..

మంత్రి సుభాష్‌కు హర్షకుమార్ హితవు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏసీ మెకానిక్ కిరణ్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్

అమలాపురం టౌన్: మీ పేరు చెప్పుకొంటూ కొందరు దందాలు, రౌడీయిజం చేస్తున్నారని, ఇదే పద్ధతి కొనసాగితే ఉపేక్షించేది లేదని రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హితవు పలికారు. మంత్రి సుభాష్ అనుచరుడు తాలూకు కొడుకునని కొందరు యువకులు అమలాపురంలో ఓ దళిత యువకుడిపై దాడి చేయడాన్ని హర్షకుమార్ ఖండించారు. యువకుల దాడిలో గాయపడి అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏసీ మెకానిక్ కిరణ్‌ను హర్షకుమార్ సోమవారం రాత్రి పరామర్శించారు. అదృష్టం బాగుండి చిన్న వయసులోనే సుభాష్ రాష్ట్ర మంత్రి అయ్యారని, అయితే కొందరు మీ అనుచరులుగా చెప్పుకొంటూ దందాలు, దాడులు, రౌడీయిజాలు చేస్తున్నారని హర్షకుమార్ అన్నారు. దందాలు చేసేవారిని మీరు కంట్రోల్ చేయకపోతే భవిష్యత్తులో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. జిల్లా దళిత ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, హర్షకుమార్ తనయుడు జీవీ శ్రీరాజ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరపతిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం హర్షకుమార్ పట్టణ సీఐ వీరబాబుకు ఫోన్ చేసి దళిత యువకుడిపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ కేసుల నమోదుపై నిరసన



పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కాట్రేనికోన: అధికార పార్టీకి అండగా నిలుస్తూ ఏక పక్షంగా అక్రమ కేసులు నమోదు చేస్తున్న పోలీసుల తీరుపై నిరసనగా వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసు స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. పల్లంకుర్రు పంచాయతీ వద్ద సర్పంచి నాతి అలివేణి జన్మదిన వేడుకల ఫ్లెక్సీని ఈనెల 11న అర్ధరాత్రి టీడీపీ నాయకులు చించివేసి తొలగించారన్నారు. అదే చోట సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలు పెట్టారన్నారు. అసలు వివాదానికి కారణమైన వారిపై కేసు నమోదు చేయకుండా తప్పుడు కేసులు నమోదు చేయడంపై కాట్రేనికోన ఎస్సై అవినాష్‌ను నిలదీశారు. ఫ్లెక్సీ చించివేసి, తొలగించిన వ్యక్తులపై కేసు నమోదు చేయకుండా ఏక పక్షంగా బాధితులపై కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పోలీసులు అధికార పార్టీకి అండగా నిలుస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఫ్లెక్సీ చింపిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు గంటి వెంకట సుధాకర్, సర్పంచులు నాతి అలివేణి, మల్లాడి బాబ్జి, నాయకులు పాలెపు ధర్మారావు, నాతి సత్యనారాయణ, కాశి హనుమంతరావు, సాపే సూర్య ప్రకాష్, గెల్లా రాజేంద్ర ప్రసాద్, అయితాభత్తుల శ్రీను, నల్లా రాంబాబు, వెంకటేశ్వరావు తదితరులు ఉన్నారు.

కోరింగా అభయారణ్యం సందర్శన



కోరింగా అభయారణ్యాన్ని సందర్శించిన ట్రైనీ ఫారెస్ట్ రేంజర్లు

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక ప్రదేశం కోరింగా అభయారణ్యాన్ని సోమవారం ట్రైనీ ఫారెస్ట్ రేంజ్ అధికారులు సందర్శించారు. హైదరాబాద్ దూలపల్లి నుంచి 34 మంది ట్రైనీ రేంజర్‌లు అభయారణ్యంలోని ప్రముఖ ప్రదేశాలన్నింటినీ ఆసక్తిగా తిలకించారు. చెక్కల వంతెనలపై నడుస్తూ, బోటు షికారు చేసి ఆనందం వ్యక్తం చేశారు. అభయారణ్యంలో గల మడ అడవుల విశిష్టత, పక్షుల వివరాలను ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ వారికి వివరించారు. కార్యక్రమంలో తెలంగాణా స్టేట్ డిప్యూటీ డీఎఫ్ఓ వీకే షాహూ, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె.సిద్ధార్థ, ఎఫ్‌బీఓలు కె.మహేష్, జి.గోపీ నాగేంద్రకుమార్, ఎం.మధు, పి.సంధ్యారాణి, సీహెచ్ ధనలక్ష్మి, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల ధర్నా



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఉద్యోగు సంఘం నేతలు

అమలాపురం రూరల్: రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. జీవో 36ను షరతులు లేకుండా అమలు చేయాలని, ఉద్యోగుల వయో పరిమితిని ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62 ఏళ్లకు పెంచాలని, 2019 వేతన సవరణ అమలు చేయాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు ధర్నాలో పాల్గొని సహకార సంఘాల ఉద్యోగుల న్యాయమైన కోర్కెలకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు మేడిచర్ల రామలింగేశ్వర రావు, ఉప ప్రధాన కార్యదర్శులు కుంపట్ల అయ్యప్ప నాయుడు, మటపర్తి జయరామ్, కె.శ్రీనివాసరాజు, తోరం దొరాజీ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధిత బాలికకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలి

అమలాపురం టౌన్: అల్లవరం మండలం గోడి గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో చేయిని కోల్పోయిన బాధిత బాలిక కేతా లాస్య మాధురి కుటుంబానికి ఆ శాఖ రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ విద్యుత్ ప్రమాదంలో చిన్నారి లాస్యతో పాటు ఆమె తల్లి రమాదేవి కూడా తీవ్రంగా గాయపడడంతో వారిద్దరికీ ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. తమ ఇంటిపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారులకు లాస్య కుటుంబం ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా తమ గోడు వినలేదని పేర్కొన్నారు. తక్షణమే ఈ ప్రమాదంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ప్రాథమిక విద్యా బోధనకు ప్రాధాన్యమివ్వాలి

ఆర్డీఓ మాధవి, డీఈవో సలీం బాషా



శిక్షణా తరగతులలో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీం బాషా

కాట్రేనికోన: చిన్నారులకు ప్రాథమిక దశలో ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని అమలాపురం ఆర్డీఓ కె మాధవి, జిల్లా విద్యాశాఖ అధికారి డా.షేక్ సలీం బాషాలు పేర్కొన్నారు. మండలంలోని చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో సోమవారం 8వ దశ శిక్షణా తరగతులను వారు ప్రారంభించారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న మెలకువలను బోధనకు జోడిస్తే ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆశయాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కోర్సు కోఆర్డినేటరు, సమగ్ర శిక్ష మానిటరింగ్ అధికారి రాంబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరు దఫాలుగా 525 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారన్నారు. మిగిలిన 725 మంది ఉపాధ్యాయులకు రెండు దశలలో శిక్షణ అందిస్తున్నామన్నారు. 9వ దశ శిక్షణ ఈ నెల 27న ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో అమలాపురం డీవైఈఓ సూర్యప్రకాశరావు, శ్రీనివాస ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస కుమార్ తదితరులు ఉన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాలను నివారిద్దాం



అమలాపురంలో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: వాహనాలను నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండి రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు పిలుపునిచ్చారు. పట్టణ పోలీసులు రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమం పలువురిని ఆలోచింపజేసింది. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ నాలుగు చక్రాల వాహనమైతే సీటు బెల్ట్, ద్విచక్ర వాహనమైతే హెల్మెట్ విధిగా ధరించి రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. విద్యానిధి స్కూలు విద్యార్థులతో పట్టణ ట్రాఫిక్ విభాగం పోలీసులు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం స్థానిక విద్యానిధి స్కూల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీఐ వీరబాబు, ఎస్సై ఏసుబాబులు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు సదస్సులో పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోండి



గొర్రెలకు నట్టల నివారణ మందు వేస్తున్న జిల్లా పశు వైద్యాధికారి వెంకటరావు

అల్లవరం: గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందు వేసేందుకు ఈ నెలాఖారు వరకు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు వైద్యాధికారి కొమ్ము వెంకటరావు తెలిపారు. మండల పశు వైద్యాధికారి ఎం నారాయణరావు ఆధ్వర్యంలో కోడూరుపాడులో సోమవారం ఉచిత నట్టల టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి వెంకటరావు మాట్లాడుతూ పశువుల్లో నట్టల నివారణ, బాహ్య పరాన్న జీవుల నిర్మూలనకు వ్యాధి నిరోధక టీకాలు ఇస్తున్నామన్నారు. పాడి పశువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీ విజయారెడ్డి, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పశువుల ఆరోగ్యాన్ని కాపాడి తద్వారా పశు సంపదను పెంచేందుకు క్షేత్రస్థాయిలో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు తెలిపారు. స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ పూర్ణిమ నాగలక్ష్మి ఆధ్వర్యంలో చిందాడగరువు గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశు వైద్యాధికారి వెంకట్రావు, సర్పంచ్ పొనకల గణేష్, సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్. విజయ రెడ్డిలు ప్రారంభించారు. సహాయ సంచాలకులు డాక్టర్ విజయరెడ్డి మాట్లాడుతూ వ్యాధిగ్రస్త పశువులను గుర్తించి చికిత్స అందించడం, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఇవ్వడం వల్ల వాటిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మోటూరి కనకదుర్గా వెంకటేశ్వరరావు, పశు వైద్య సహాయకులు రమణ, మోహన్, మౌనిక, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పశువుల ఆరోగ్యం, ఉత్పాదకతను పెంచడంతో పాటు పశు వ్యాధుల నియంత్రణ కోసం పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ బ్రహ్మవేద కోరారు. సోమవారం నీలపల్లి పంచాయతీ నేరెళ్లంక గ్రామంలో ఆయన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. మండలంలో ఈ నెల 20నుంచి 31వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

శ్రమదానంతో పూడికతీత పనులు



శ్రమదానంతో సాగునీటి కాలువలో పూడిక తీస్తున్న రైతులు

యానాం: దరియాలతిప్ప ఆయకట్టుకు సాగునీటితో పాటు తీర ప్రాంత గ్రామాలకు తాగునీరు సైతం అందిస్తున్న ఫ్రెంచి కెనాల్‌లో పూడికతీత పనులు చేపట్టాలని గత కొన్నేళ్లుగా స్థానిక పీడబ్ల్యూడీ శాఖకు విన్నవించినా పట్టించుకోక పోవడంతో సోమవారం అధిక సంఖ్యలో రైతులు స్వచ్ఛందంగా శ్రమదానం చేపట్టారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ దరియాలతిప్ప రైతు సంఘం రైతులు పడుతున్న ఇబ్బందులను చూసి ఆయన ఆర్థిక సహకారంతో ఇసుక కాలువ నుంచి దరియాలతిప్ప వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర ఉన్న సాగునీటి కాలువలో పూడికతీత పనులు చేపట్టారు. సుమారు 30 మంది రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పూడికను తొలగించడంతో శివారు పంట పొలాలకు సైతం సాగునీరు అందుతుందన్నారు. సుమారు 120 మంది పీడబ్ల్యూడీ ఎన్ఎంఆర్‌లు ఉన్నప్పటికీ ఉపయోగం లేదని వారు ఎక్కడ ఉంటున్నారో కూడా తెలియడం లేదని రైతు నాయకుడు సబ్బతి లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్డీవో గ్రీవెన్స్‌కు 6 అర్జీలు



ఆర్డీవో మాధవికి అర్జీ అందజేస్తున్న అర్జీదారుడు

అమలాపురం టౌన్: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (రెవెన్యూ గ్రీవెన్స్) కార్యక్రమానికి ఆరు అర్జీలు వచ్చాయి. ఆర్డీవో కె.మాధవి అధ్యక్షతన నిర్వహించిన ఈ గ్రీవెన్స్‌కు రెవెన్యూ డివిజన్ పరిధిలో భూ సంబంధమైన ఫిర్యాదులు అందాయి. వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయా మండల తహసీల్దార్లకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేశారు.

ఖాళీ స్థలాల కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం రూరల్: ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, మిగులు భూములను స్వాధీనం చేసుకోవాలని అమలాపురం మండలం నడిపూడి అంబేడ్కర్ కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నడిపూడి అంబేడ్కర్ కాలనీలోని ఇళ్ల స్థలాల్లో ఎవరికి వారు గృహ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. మిగిలిన స్థలాలు నేటికీ నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని కొందరు భూ కబ్జా దారులు నకిలీ పట్టాలు సృష్టించి ఎవరికి నచ్చిన రీతిలో వారు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. సమగ్ర సర్వే నిర్వహించి అన్యాక్రాంతం అవుతున్న భూములను పరిరక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోండి

అమలాపురం టౌన్: ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభమయ్యే అంతర్వేది ఉత్సవాల్లో మద్యం, మాంసం అమ్మకాలతో పాటు అనధికార బెల్ట్ షాపుల ద్వారా అమ్మకాలను పూర్తిగా నిరోధిస్తూ చర్యలు చేపట్టాలని భజరంగ్ దళ్ ప్రతినిధుల బృందం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. భజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు ఆధ్వర్యంలో ప్రతినిధులు అమలాపురంలోని ఎస్పీ కార్యాలయానికి సోమవారం వెళ్లి ఎస్పీ కృష్ణారావుకు వినతి ప్రతం అందించారు. ఉత్సవాల సమయంలో అంతర్వేది వీధుల్లో అన్యమత ప్రచారం జరగకుండా చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. భజరంగ్ దళ్, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు ఊటుకూరి సాంబయ్య, చిలకలపూడి రవి, గుత్తుల సుగణ, లంకే నరేంద్ర, పొన్నాల అర్జున్ తదితరులు ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్‌కు నూతన కార్యవర్గం

అమలాపురం టౌన్: అమలాపురం ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం జరుగుతాయని అసోసియేషన్ నూతన అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు తెలిపారు. ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్‌కు ఎన్నికైన నూతన కార్యవర్గ వివరాలను ఆయన వివరించారు. నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారంతో పాటు వార్షికోత్సవ వేడుకలకు అమలాపురం ఆర్డీవో కె.మాధవి, లయన్స్ పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.

ఏర్పాట్లను వేగవంతం చేయాలి

అమలాపురం రూరల్: అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో 22, 23వ తేదీల్లో జరిగే కోనసీమ క్రీడోత్సవాలకు ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆర్డీవో కె.మాధవి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్డీవో మాధవి, డీఈవో సలీం బాష, జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ చీఫ్ కోచ్ పీఎస్ సురేష్‌కుమార్, స్కూల్ గేమ్స్ సెక్రటరీ అడబాల విజయ శ్రీనివాస్‌లు పనులను పరిశీలించారు.

24న జాబ్‌మేళా

యానాం: పుదుచ్చేరి కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 24న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఉపాధి డైరెక్టర్ యాసం లక్ష్మీనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే జాబ్‌మేళాలో మనకుల వినాయగర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, వెస్ట్ మెడ్ హాస్పటల్, ఎల్ఎస్ఈ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్, పీవీఎం ఎసికామ్ లిమిటెడ్, ఇంటిగ్రాలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఇంటర్వ్యూల ద్వారా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. డిప్లొమో, ఇంజినీరింగ్, ఆర్ట్స్ తదితర విభాగాల్లో భారీగా ఉద్యోగాలను భర్తీ చేస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్‌లు, రెజ్యూమ్‌లతో హాజరు కావాలని కోరారు.

కలుషిత వ్యర్థాలను తొలగించాలి

తాళ్లరేవు: ప్రజల దాహార్తిని తీర్చే పంట కాలువలో కలుషిత వ్యర్థాలను తక్షణమే తొలగించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఇంజరం వంతెన వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను సంఘ సభ్యులు పరిశీలించారు. సుమారు 10 గ్రామాల ప్రజలకు తాగునీటి కోసం వినియోగించే ఈ నీరు కలుషితం కావడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతుందని, తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను నివారించాలని రాజబాబు కోరారు.